క్లుప్తంగా

దర్శిలో కమాండ్ కంట్రోల్ రూమ్

దర్శి: భారీ వర్షాల నేపథ్యంలో దర్శి నగర పంచాయతీ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ మహేష్ తెలిపారు. నివాసాలు, లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యే అవకాశం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు చెప్పారు. పట్టణంలో ఎవరికైనా వర్షాలతో ఎటువంటి సమస్యలు ఉన్నా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ 94416 74722 చేయాలని కోరారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

పుల్లలచెరువు: నేడు పుల్లలచెరువు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వసంతరావునాయక్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ వెంకటయ్య అధ్యక్షతన మండల సమావేశం నిర్వహించనున్నామని, సమావేశానికి ఎంపీటీసీలు తప్పని సరిగా హాజరు కావాలని, మండల స్థాయి అధికారులు కూడా తగిన సమాచారంతో సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

పాస్టర్ ప్రభుదాసు దంపతులకు సన్మానం

దొనకొండ: దైవ సేవలందిస్తూ ఆధ్యాత్మిక సంఘాన్ని బలపరిచిన పాస్టర్ డి.ప్రభుదాసు ఆయన సతీమణి దానమ్మలను సంఘ పెద్దలు సోమవారం ఘనంగా సన్మానించారు. ప్రభుదాసు సేవలు ఎనలేనివని సంఘ పెద్దలు కొనియాడారు. అనంతరం ప్రభుదాసు దంపతులకు సంఘస్తులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఎంబీవీ ప్రసాద్, శేకర్, రాజు, సుధీర్, దేవానంద్ పాల్గొన్నారు.

మద్యం షాపులన్నీ టీడీపీ మద్దతుదారులవే

- ఏరులై పారనున్న మద్యం
- ఇప్పటికే సిండికేట్‌గా ఏర్పడిన నేతలు
- అధినేతకు 50 శాతం వాటా ఇస్తారా?
- ధరలు ఇబ్బడిముబ్బడిగా పెంచేందుకు కసరత్తు



దర్శి: నియోజకవర్గంలో మద్యం షాపులన్నీ టీడీపీ మద్దతుదారులే కైవసం చేసుకున్నారు. టీడీపీ నాయకులు గ్రూపులుగా తయారై 20 మంది, 30 మంది కలిసి ఒక్కొక్కరు తలా ఒకటి రెండు షాపులకు దరఖాస్తులు చేసుకుని తగిలిన షాపులు దామాషా ప్రకారం పంచుకునేలా దరఖాస్తు చేశారు. నియోజకవర్గంలో 23 షాపులకు 382 దరఖాస్తులు మాత్రమే అందాయి. అంటే జిల్లాలో అత్యల్పంగా దరఖాస్తులు అందింది దర్శి నియోజకవర్గంలో మాత్రమే. నియోజకవర్గంలో ఆయా మండలాల్లో గ్రూపులుగా తయారై షాపులు దక్కించుకున్న వారందరినీ కలిపి సిండికేట్‌గా తయారై షాపులు ఏర్పాటు చేసి అధిక ధరలకు మద్యం విక్రయించేందుకు కసరత్తు చేస్తున్నారు.. దీనికి తోడు గతంలో నియోజకవర్గ టీడీపీ నేత ఎవరైనా మద్యం దుకాణాలకు దరఖాస్తు చేయాలంటే 50 శాతం వాటా తమకివ్వాలని హుకుం జారీ చేసినట్లు పుకార్లు షికార్లు చేశాయి. అంతే కాకుండా నియోజకవర్గం మొత్తం సిండికేట్ చేస్తాం.. ఆసిండికేట్‌ను మేమే నడిపిస్తాం.. మీకు వచ్చే వాటా ప్రకారం మీకు చెల్లిస్తామని ముందే చెప్పినట్లు సమాచారం. దీంతో టీడీపీలో షాపులు దక్కించుకున్న వారే అందరూ ఉండటంతో అధికారాన్ని అడ్డు పెట్టుకుని ప్రభుత్వం అందించిన ధర కంటే ఎంత ఎక్కువ రేట్లు పెడుతారో అని మందుబాబులు సైతం ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ఉన్న ఎక్సైజ్, పోలీస్ అధికారులు ఎమ్మార్పీకే మద్యం విక్రయించేలా చర్యలు తీసుకుంటారా? లేక కాసుల కక్కుర్తికి తలొంచుతారో వేచి చూడాల్సిందే. ఇదిలా ఉండగా నియోజకవర్గంలో బెల్ట్ షాపులు, పట్టణంలోని రెస్టారెంట్‌లు సైతం ఈ పాటికే ప్రైవేటు మద్యం కోసం తలుపులు బార్లా తీసి ఉన్నారు. వీరందరినీ కంట్రోల్ చేసి ప్రభుత్వం పద్ధతి ప్రకారం మద్యం విక్రయాలు జరుగుతాయా లేదా అన్న విషయం ప్రశ్నార్థకంగా మారింది.

షాపులు దక్కించుకుంది వీరే..

నియోజకవర్గంలో 23 మద్యం షాపులు ఉండగా దర్శి నగర పంచాయతీ పరిధిలో 5, రూరల్‌లో 4, కురిచేడు 3, దొనకొండ 3, తాళ్లూరు 4, ముండ్లమూరు 4 షాపులకు ప్రభుత్వం అనుమతిచ్చింది. వీటిలో దర్శి నగర పంచాయతీ పరిధిలో తిండి నారాయణరెడ్డి, నిడమానూరి నరశింహారావు, దండే ప్రసాద్‌కు రెండు షాపులు, దూళిపాళ్ల రమ్యకృష్ణ, మధుమంచి ఏడుకొండలు, పుల్లలచెర్వు సత్యనారాయణ, తానికొండ వెంకట్రావు, బోయళ్ల నాగేశ్వరరెడ్డికి దక్కాయి. కురిచేడు మండలంలో ఇంటూరి శ్రీనివాసరావు, పి. రామాంజనేయులు, గడ్డం బాలయ్య, దొనకొండ మండలంలో తాంద్ర వెంకటేశ్వర్లు, పులిగడ్డ సాయికృష్ణ, తుపాకుల శివప్రసాద్, తాళ్లూరు మండలంలో కూనం సత్యవాణి, యర్రంరెడ్డి వెంకటరెడ్డి, గణపర్తి సంజయ్, పోలంరెడ్డి సుధాకర్‌రెడ్డి, ముండ్లమూరు మండలంలో కూరపాటి నారాయణస్వామి, జంపని శ్రీనివాసరావు, మార్తుల యలమందారెడ్డి, యన్నగిరి వెంకట్రావులు షాపులు దక్కించుకున్నట్లు తెలుస్తోంది.

వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి

పుల్లలచెరువు: రాగల నాలుగు రోజులు జిల్లాలో పడుతున్న వర్షాల ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ నయీం అహ్మద్ సూచించారు. ఆయన సోమవారం మాట్లాడుతూ రాష్ట్రంలో పడుతున్న వర్షాల దృష్ట్యా కలెక్టర్ ఆదేశాలపై వర్షాలు పడుతున్నందున గ్రామాల్లోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వీఆర్వోలు కూడా గ్రామాల్లో ఉంటూ సమాచారం తెలుసుకోవాలన్నారు. గ్రామాల్లోని వాగులు, చెర్వులు, వర్షం ప్రభావంతో తెగిన లేక ప్రజలకు ఇబ్బందులు కలిగినా వెంటనే తెలియజేయాలన్నారు. ముఖ్యంగా గ్రామాల్లో మట్టి మిద్దెల్లో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని, రాత్రి వేళ వాటిల్లో పడుకోవద్దన్నారు. వీఆర్వోలు గ్రామాల్లో వాటిని గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, వర్ష సమాచారంలో అజాగ్రత్తగా ఉంటే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.



నిశ్చితార్థానికి హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

నిశ్చితార్థానికి హాజరైన బూచేపల్లి వెంకాయమ్మ

దర్శి: మండలంలోని బసిరెడ్డిపల్లెలో కాసు వారి నిశ్చితార్థ వేడుకలకు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ హాజరయ్యారు. అక్షతలు వేసి కాబోయే ఆశీర్వదించారు. అదేవిధంగా జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షుడు బండి గోపాల్ రెడ్డి కుమారుడు వెంకట శశిధర్‌రెడ్డి పుట్టిన రోజు వేడుకలకు హాజరయ్యారు.

సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కేసరి రాంభూపాల్‌రెడ్డి, మాజీ నెడ్‌క్యాప్ డైరెక్టర్ సానికొమ్ము రాజ్యలక్ష్మి తిరుపతిరెడ్డి, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు చింతలపూడి శ్రీనివాసరెడ్డి, కేసరి ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

జీవం పోసుకున్న పంటలు



మిరప తోటలో నిలిచిన నీరు

దొనకొండ: కురుస్తున్న వర్షానికి సాగు చేసిన పంటలు జీవం పోసుకున్నాయి. గ్రామాల్లోని రైతులు పత్తి, మిరప, పొగాకు తదితర పంటలు సాగు చేశారు. సరైన వర్షం కురవక రైతులు పెట్టుబడులు పెట్టి నాటిన పంటలు గిడుగుబారాయి. తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షానికి ఎండు ముఖం పట్టిన పంటలు జీవం పోసుకోవడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మిరప, పొగాకు నాటిన మొక్కలు ఎండిపోవటంతో ఈ వర్షానికి రైతులు వేరే ప్రాంతాల నుంచి నారు కొనుగోలు చేసి పొలాల్లో నాటుకుంటున్నారు. కొంతమంది రైతులు మిరప పంటలో నీరు నిల్వ ఉంటే మొక్క ఉరక ఎత్తుతాయని పొలంలో నుండి నీరు బయటకు వెళ్లబెడుతున్నారు.